సాక్షి
జోగులాంబ గద్వాల
ఆదివారం । 10 । డిసెంబర్ । 2023



ప్రతిభావంతులకు 'ఉపకారం'
ఎన్ఎంఎంఎస్ ద్వారా ప్రతిభావంతులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందిస్తోంది.
వివరాలు 8లో ▸



హోరాహోరీగా..
బాదేపల్లిలో జరుగుతున్న రాష్ట్ర ఫుట్‌బాల్ టోర్నీ హోరాహోరీగా సాగుతుంది.
వివరాలు 10లో ▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
32.8 /18.6
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం వేళ చిరు జల్లులు కురవచ్చు. రాత్రి చలి తీవ్రత అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

వేరుశనగ క్వింటా రూ.8,291

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్‌యార్డుకు శనివారం 856 క్వింటాళ్ల వేరుశనగ రాగా, గరిష్ఠం రూ.8291, కనిష్ఠం రూ.4099, సరాసరి రూ.6099 ధరలు పలికాయి. 37 క్వింటాళ్ల ఆముదం రాగా, గరిష్ఠం రూ. 5427, కనిష్ఠం రూ.5281, సరాసరి రూ. 5427 ధరలు వచ్చాయి. 2384 క్వింటాళ్ల వరి (సోన) రాగా గరిష్ఠం రూ.3269, కనిష్ఠం రూ. 2079, సరాసరి ధర రూ. 2630 ధరలు పలికాయి. 423 క్వింటాళ్ల వరి (హంస) రాగా, గరిష్ఠం రూ. 2099, కనిష్ఠం రూ. 1439, సరాసరి రూ. 2050 ధరలు వచ్చాయి.

ఆర్ఎన్ఆర్‌కు రికార్డు ధర

జడ్చర్ల/దేవరకద్ర: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం ధాన్యానికి రికార్డు స్థాయి ధర దక్కింది. ఆర్ఎన్ఆర్ రకం ధాన్యానికి క్వింటాలు గరిష్ఠంగా రూ.3,356, కనిష్ఠంగా రూ.1,769 ధరలు లభించాయి. అదేవిధంగా హంస రకానికి గరిష్ఠంగా రూ.2,056, కనిష్ఠంగా రూ.1,810, శ్రీరాంగోల్డ్ ధాన్యంకు రూ.2,937, మొక్కజొన్నకు గరిష్ఠంగా రూ.2,352, కనిష్ఠంగా రూ.2,050, పత్తికి గరిష్ఠంగా రూ.6,949, కనిష్ఠంగా రూ.4,890 ధరలు పలికాయి.

■ దేవరకద్ర మార్కెట్ యార్డులో శనివారం జరిగిన ఈనామ్ టెండర్లలో శ్రీరాంగోల్డ్ ధాన్యం ధర క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.3,269, కనిష్ఠంగా రూ.2,813గా ధరలు నమోదయ్యాయి. హంస ధాన్యం ధర గరిష్ఠంగా రూ.2,032, కనిష్ఠంగా రూ.1,853గా ధరలు లభించాయి. ఆముదాల ధర క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.5,412, కనిష్ఠంగా రూ.5,384గా ధరలు వచ్చాయి.

తెలంగాణ ఇచ్చిన ఘనత సోనియాదే..

గద్వాల అర్బన్: తెలంగాణ ప్రజల ఆకాంక్ష మేరకు తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన ఘనత కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీకే దక్కుతుందని జెడ్పీచైర్‌పర్సన్ సరిత అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సోనియాగాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. జెడ్పీచైర్‌పర్సన్ క్యాంపు కార్యాలయం నుంచి రాజీవ్‌సర్కిల్ వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం రాజీవ్‌సర్కిల్‌లో కేక్ కట్ చేసి, సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలో రాఘవేంద్ర కాలనీలోని అంధుల పాఠశాలలో విద్యార్థులతో కేక్ కట్ చేసి సోనియాగాంధీ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఇచ్చిన మాటకు కట్టుబడి 60 ఏళ్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన మహనీయురాలు సోనియాగాంధీ అని కొనియాడారు. సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేసిన రోజే క్యాబినెట్‌ను ఏర్పాటు చేసుకొని ఆరు గ్యారంటీల్లో భాగంగా రెండు గ్యారంటీలను అమలు చేశారన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీచైర్మన్ బండారీ భాస్కర్, నాయకులు శంకర్, చంద్రశేఖర్ రెడ్డి, నల్లారెడ్డి, మధుసుదన్‌బాబు ఉన్నారు.

సంగమేశ్వరాలయంలో పూజలు

కొల్లాపూర్: సప్తనదుల సంగమ స్థానమైన కృష్ణానదిలో సంగమేశ్వరాలయం పూర్తిగా తేలింది. శ్రీశైలం బ్యాక్‌వాటర్ నిండుగా ఉండే సమయంలో ఈ ఆలయం పూర్తిగా నీటిలో మునిగిపోతుంది. నదిలో నీటిమట్టం తగ్గిన తర్వాత మళ్లీ దర్శనమిస్తుంది. ప్రతి ఏటా జనవరి నెలాఖరు లేదా ఫిబ్రవరిలో ఈ ఆలయం తేలుతుంది. అయితే ఈసారి వర్షాలు సమృద్ధిగా కురవకపోవడం, వరదలు ఆశించిన స్థాయిలో రాకపోవడంతో కృష్ణానదిలో నీటిమట్టం తగ్గింది. దీంతో డిసెంబర్ నెల ప్రారంభంలోనే ఆలయం పూర్తిగా తేలడంతో వారం రోజులుగా ఆలయ ప్రధాన అర్చకులు రఘురామశాస్త్రి సంగమేశ్వరునికి పూజలు జరిపిస్తున్నారు. కార్తీక మాసంలో ఆలయంలో పూజలు జరగడం దశాబ్దాల కాలం తర్వాత ఇదే తొలిసారని భక్తులు చెబుతున్నారు.

రఘుపతిపేట రైతుకు జాతీయ అవార్డు



కల్వకుర్తి రూరల్: మండలంలోని రఘుపతిపేటకు చెందిన రైతు అనంత ప్రవీణ్‌రెడ్డికి జాతీయ అవార్డు లభించింది. మిలియనీర్ ఫార్మర్ ఆఫ్ ఇండియా అవార్డును ఆయన అందుకున్నారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ ఆధ్వర్యంలో కృషి జగ్రాన్ యూనివర్సిటీ దేశంలోని 29 రాష్ట్రాల నుంచి ఉత్తమ అభ్యుదయ రైతులకు ఈ అవార్డు అందించింది. కొత్త వరి రకాలను సాగు చేయడం, నూనె గింజల పంటలను, పత్తి తదితర వాణిజ్య పంటలతో పాటు సాగు చేయడంలో ప్రవీణ్‌రెడ్డి దిట్ట.

ఎంతో వెసులుబాటు



కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన మహాలక్ష్మీ పథకం ద్వారా నా ఫస్ట్ ప్రయాణంలోనే రూ.1400 ఆదా అయ్యాయి. హైద్రాబాద్‌లో చదువుతున్న పిల్లలను చూసేందుకు వెళ్తున్నా. అయితే ఉచితంగా ప్రయాణం చేయడంలో సంతోషంగా ఉంది. ఈ పథకం సామాన్య ప్రజలకు ఎంతో వెసులుబాటునిస్తుంది.

– ప్రియాంక కృపకర్, ప్రయాణికురాలు. గద్వాల

సంతోషంగా ఉంది



రాష్ట్రం మొత్తం ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణం చేయవచ్చు అంటే చాలా సంతోషంగా ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మహిళల కోసం ఈ పథకం అమలుచేయడం చాలా బాగుంది. కుటుంబ సభ్యులతో కలిసి దూర ప్రయాణం చేయాల్సి వస్తే రూ.2వేలు ఖర్చు అయ్యేవి. ఇక నుంచి కేవలం రూ.600 ఖర్చు అవుతాయి. మా ఇంట్లో ముగ్గురు మహిళలం ఉచితంగా ప్రయాణం చేయవచ్చు.

– జయమ్మ, ప్రయాణికురాలు గద్వాల

మహాలక్ష్మి రైట్..రైట్..

ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం షురూ



గద్వాలలో మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి, జెడ్పీచైర్‌పర్సన్ సరిత, ఎస్పీ

- మహాలక్ష్మీ ఉచిత బస్సు.. రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం ప్రారంభించిన కలెక్టర్, జెడ్పీచైర్‌పర్సన్
- హర్షం వ్యక్తం చేసిన మహిళా లోకం



ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేస్తున్న కలెక్టర్, జెడ్పీచైర్‌పర్సన్ తదితరులు

గద్వాల క్రైం: హామీల అమల్లో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాలను జిల్లాలో శనివారం అట్టహాసంగా ప్రారంభించారు. జిల్లా ఆస్పత్రిలో కలెక్టర్ వల్లూరు క్రాంతి, జెడ్పీచైర్‌పర్సన్ సరిత పథకాలను ప్రారంభించారు. అనంతరం జెడ్పీచైర్‌పర్సన్ సరిత మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు హామీల్లో రెండింటిని అమలు చేస్తుందన్నారు. మహాలక్ష్మి పథకం పేదింటి ఆడబిడ్డల కోసం రూపొందించిన గొప్ప కార్యక్రమం అని, దీని వల్ల వారికి ఆర్థికంగా తోడ్పాటునందిస్తుందని కొనియాడారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ (చేయూత) గత ప్రభుత్వ హయాంలో ఆరోగ్య శ్రీ ద్వారా రూ.5లక్షలు మాత్రమే ఇవ్వడం జరిగేదని, నేటి నుంచి ఈ పథకం ద్వారా 1.66 లక్షల మందికి రూ.10లక్షల వరకు వైద్యఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ప్రజల ప్రభుత్వం అంటేనే కాంగ్రెస్ అని.. ఈ పథకాల అమలు ప్రతి పక్షలకు చెంపపెట్టు వంటివని అన్నారు.

■ కలెక్టర్ వల్లూరు క్రాంతి మాట్లాడుతూ.. మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం మహిళలకు, విద్యార్థినులకు ఎంతో దోహదపడుతుందని, రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు మెరుగైన వైద్యం అందుతుందని, జిల్లా పరిధిలోని స్రవంతి ఆసుపత్రి, సుభాకర ఆసుపత్రిలో రాజీవ్ ఆరోగ్య శ్రీ ద్వారా సేవలు పొందవచ్చన్నారు. అనంతరం ఆసుపత్రి నుంచి గద్వాల బస్ డిపో వరకు బస్సులో వారు ప్రయాణం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాసులు, ఎస్పీ రితిరాజ్, జిల్లా వైద్యాధికారులు శశికళ, సిద్దప్ప, కిషోర్‌కుమార్, డిపో మేనేజర్ మంజులా, తదితరులు పాల్గొన్నారు.

మహిళల హర్షం

ఈ పథకం కింద మహిళలు, విద్యార్థినులు, ట్రాన్స్‌జెండర్లకు పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడంతో మహిళా లోకం హర్షం వ్యక్తం చేస్తోంది. వివిధ ప్రాంతాలకు ప్రయాణం చేయాల్సిన క్రమంలో రవాణా చార్జీల రూపంలో డబ్బులు వెచ్చించాల్సిన పరిస్థితి ఉండకపోవడం.. రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత ప్రయాణం కల్పించడం శుభపరిణామమని పేర్కొంటున్నారు.

మహిళలకు వరంలాంటిది

వివిధ పనుల నిమిత్తం తరచూ మహబూబ్‌నగర్‌కు ప్రయాణించాల్సి వచ్చేది. బస్సుల్లో వెళ్తే చార్జీల రూపంలో రూ.4వేలు ఖర్చు అయ్యేవి. మహాలక్ష్మి పథకం ద్వారా ఆ డబ్బు ఆదా అవుతోంది. మాలాంటి మహిళలకు ఇదొక వరంగా మారింది.

– కవిత, ప్రయాణికురాలు, గద్వాల

నిరుద్యోగులకు మంచి అవకాశం

ప్రభుత్వం తీసుకువచ్చిన ఉచిత బస్సు రావాణా సౌకర్యాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి. ఉద్యోగ అవకాశాల కోసం నిత్యం మౌకిక పరీక్షలు, ఇంటర్వ్యూలు, ఉన్నత చదువుల కోసం రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు వెళ్లాలంటేనే ఖర్చుతో కూడుకునేది. ఇక నుంచి ఎలాంటి భారం లేకుండా రాష్ట్రంలో వారి గమ్యస్థానాలకు వెళ్లేందుకు ఇదొక మంచి అవకాశం.

– ప్రియాంక, జిల్లా ఉపాధికల్పనధికారి

ఆర్థికభారం తగ్గనుంది



చదువుకునేందుకు వెళ్లాలంటే మా ఊరి నుంచి ప్రతి నెల బస్సుల్లో రాకపోకల ఖర్చు రూ.1200 అయ్యేది. తల్లిదండ్రులు వ్యవసాయ కూలి పనులు చేస్తారు. వచ్చే ఆ డబ్బే మాకు ఆధారం. నేటితో తల్లిదండ్రులకు ఆర్థిక భారం నుంచి ఉపశమనం కలిగింది. ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ పథకం మాలాంటి విద్యార్థులకు చాలా ఉపయోగకరం.

– వినిత, ఇర్కిచెడ్, ధరూర్ మండలం

ఈ రోజు గుర్తుండిపోతుంది



ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ అవకాశం కల్పించడం ఆనందంగా ఉంది. పథకం ప్రారంభించిన తొలిరోజు ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణించిన వారందరికి ఈరోజు గుర్తుండిపోతుంది. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు హామీలన్నీ ఇలాగే అమలు చేయాలి. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలో భాగంగా రూ.10లక్షలకు పెంచడంతో ఎంతోమంది పేదలకు మేలు చేకూరనుంది.

– బుద్దమ్మ, అమరవాయి, మల్దకల్ మండలం

డబ్బు జమ చేసుకోవచ్చు



ఇన్ని రోజులు బస్సులో వెళ్లాలంటే డబ్బులు లెక్కపెట్టుకొని, సరిచూసుకోవాల్సి వచ్చేది. ఇప్పుడు చిల్లి గవ్వా లేకున్నా సరే రాష్ట్రమంతా తిరిగి రావచ్చు. చాలా డబ్బులు మిగిలిపోతున్నాయి. జమ చేసుకోవచ్చు.

– లక్ష్మి, ఉత్తనూరు, అయిజ మండలం

ఇంత త్వరగా అమలు చేస్తుందనుకోలే..



కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఇంత త్వరగా అమలుచేస్తుందని అనుకోలేదు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ఉచిత ప్రయాణం కల్పించడం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఒక్క రూపాయి తక్కువగా ఉంటేనే కండెక్టర్లు బస్సులో నుంచి దింపేవారు. ఇప్పుడు ఒక్క రూపాయి లేకున్నా రాష్ట్రంలో ఎంతదూరమైన ఉచితంగా ప్రయాణం చేయవచ్చు. ఎంతో ఆనందంగా ఉంది.

– బాలమ్మ, కొండపల్లి, గద్వాల మండలం

ఎప్పటికీ కొనసాగించాలి



సీఎం రేవంత్‌రెడ్డి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని ప్రారంభించడం బాగుంది. అలంపూర్ ప్రాంతం రాష్ట్రానికి సరిహద్దులో ఉండడం బస్సులో ఉచితంగా ఏపీ సరిహద్దు వరకు వెళ్లాం. అక్కడి నుంచి టికెట్ తీసుకున్నాం. ఈ పథకం ఎన్ని రోజులు అమల్లో ఉంటుందో తెలియదు. ఎప్పటికీ కొనసాగిస్తే బాగుంటుంది.

– లక్ష్మీతేజ, బుక్కాపూర్

మహిళలకు ప్రాధాన్యత



కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పించడం సంతోషంగా ఉంది. గతంలో కుటుంబసభ్యులం అందరం కలిసి ఒక పుణ్యక్షేత్రానికి, శుభకార్యానికి వెళ్లాలంటే రూ.వేలకు వేలు ఖర్చు అయ్యేవి. ఇప్పుడు ఆ బాధలు తప్పుతాయి.

– లాస్య, అలంపూర్ పట్టణం

ఖాకీల్లో బదిలీల టెన్షన్

- ఎన్నికలు ముగియడంతో ఊపందుకున్న ప్రచారం
- ఉమ్మడి జిల్లాలో ఉన్నతాధికారుల నుంచి ఎస్ఐల వరకు స్థానచలనం
- ఈసారి భారీస్థాయిలో జరిగే అవకాశం
- డిమాండ్ స్టేషన్లలో పోస్టింగ్‌లకు పైరవీలు షురూ
- ఇప్పటికే నేతల టచ్‌లోకి కొందరు అధికారులు



మహబూబ్‌నగర్ క్రైం: అసెంబ్లీ ఎన్నికలు ముగియడంతో రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఈ క్రమంలోనే ఉమ్మడి జిల్లాలో దాదాపు 12 నియోజకవర్గాల్లో కొత్త ఎమ్మెల్యేలు గెలుపొందారు. అయితే రాష్ట్రంలో ప్రభుత్వాలు మారిన ప్రతిసారి పోలీసుల బదిలీలు అనివార్యమైనప్పటికీ ఈసారి గతం కంటే భారీగా జరుగుతున్నాయనే ప్రచారం ఊపందుకుంది. ఉమ్మడి పాలమూరు జిల్లాలో పనిచేస్తున్న పోలీస్ అధికారుల్లో చాలా వరకు ఇతర ప్రాంతాలకు వెళ్లే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో పని చేస్తున్న డీఎస్పీ అధికారి నుంచి ఎస్ఐల వరకు బదిలీల బెంగ మొదలైంది. ఎన్నికల సమయంలో ఒకే పార్టీకి చెందిన వారికి మద్దతు ఇస్తూ ఇతర పార్టీల నేతలతో పాటు కార్యకర్తలను ఇబ్బందులు పెట్టారని కొందరు పోలీస్ అధికారులపై ఆరోపణలు ఉన్నాయి. నేరుగా సదరు పోలీస్ అధికారులపై ఇతర పార్టీల నేతలు విమర్శలు చేసిన ఘటనలు అనేకం. దీంతో అలాంటి పోలీస్ అధికారుల బదిలీలు జరుగుతాయా.. లేదా.. అనేది చూడాల్సి ఉంది.

బాస్‌లను మారుస్తారా..?

ఎన్నికల కమిషన్ ఆదేశానుసారం షెడ్యూల్ విడుదల తర్వాత నాన్ క్యాడర్ అధికారుల స్థానంలో ఉమ్మడి జిల్లాలో ఐపీఎస్ అధికారులను ఎస్పీలుగా నియమించారు. మహబూబ్‌నగర్ ఎస్పీతో పాటు నారాయణపేట, గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో నాన్ క్యాడర్ అధికారులను మార్పు చేసి ఐపీఎస్‌లకు బాధ్యతలు అప్పగించింది. వీరు అధికార, ప్రతిపక్ష పార్టీలు అనే తేడా లేకుండా కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు తీరును పర్యవేక్షించారు. అయితే ప్రస్తుతం కూడా వారే కొనసాగుతారా.. లేక కొత్త వారు వస్తారా.. అనేది కొన్ని రోజుల్లో తెలియనుంది. ప్రస్తుతం కొందరు కేవలం ఎన్నికల విధులు తప్ప ఇతర ఫైల్స్‌పై దృష్టిపెట్టడం లేదని సమాచారం. అత్యవసరమైతే తప్ప వాటిని చూడటం లేదని సమాచారం.

ఆ పోస్టింగ్‌లకు డిమాండ్

ఉమ్మడి జిల్లాలో చాలా పోలీస్‌స్టేషన్‌లకు బాగా డిమాండ్ ఉంది. అలాంటి పోస్టింగ్‌లలో సీటు కోసం ఇప్పటికే పైరవీలు ప్రారంభించారు. ఎమ్మెల్యేలతో పాటు ముఖ్య నేతలకు టచ్‌లోకి వెళ్తున్నారు. అక్రమ దందాలు జరిగే పోలీస్‌స్టేషన్లలో పోస్టింగ్‌లు దక్కించుకోవడానికి ఎవరికి వారు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఉమ్మడి జిల్లాలో జాతీయ రహదారుల వెంట ఉన్న పోలీస్‌స్టేషన్‌లతో పాటు ఇసుక అక్రమ రవాణ, స్థిరాస్తి వ్యాపారం, జూదం ఇలా యథేచ్ఛగా సాగే దందాలు జరిగే ప్రాంతాలపై దృష్టి పెట్టారు.

సిఫార్సులతోనే ఇక్కడికి..

ఏఎస్పీ, డీఎస్పీ స్థాయి నుంచి మొదలుకొని సీఐ, ఎస్ఐ వరకు ప్రస్తుతం పనిచేస్తున్న వారంతా బదిలీ అయ్యే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఎన్నికలో బదిలీల్లో భాగంగా వచ్చిన వారు కాకుండా గత కొద్ది రోజులుగా స్థానికంగా విధులు నిర్వహిస్తున్న మెజారిటీ అధికారులు సిఫార్సులతోనే ఇక్కడికి వచ్చారు. ఇలాంటి వారంతా బదిలీపై వెళ్లే అవకాశం ఉంది. ప్రస్తుతం దూర ప్రాంతాల్లో ఉన్నవారితోపాటు ఏళ్లుగా లూప్‌లైన్‌లో పనిచేస్తున్న పలువురు పోలీస్ అధికారులు ఉమ్మడి జిల్లాకు రావడానికి ఆసక్తి చూపుతున్నారు. కొందరు అధికారులకు సమర్థత ఉన్నప్పటికీ సిఫార్సు చేసేవారు లేకపోవడంతో ఎస్‌బీ, సైబర్ క్రైం వంటి విభాగాల్లో పనిచేస్తున్నారు. అలాంటి వారు లా అండ్ ఆర్డర్ వింగ్‌లో విధులు నిర్వహించేందుకు ఇప్పటికే ప్రయత్నాలు మొదలుపెట్టారు.

వైభవంగా శ్రీనివాస కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న పండితుడు

గద్వాల: బాజా భజంత్రీలు.. వేద మంత్రోచ్ఛరణల మధ్య.. శ్రీనివాస కల్యాణం వైభవంగా నిర్వహించారు. మార్గశిర, కార్తీకమాసాన్ని పురస్కరించుకుని గోవింద మాల ధరించిన మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ దంపతుల ఆధ్వర్యంలో శనివారం ఉదయం గద్వాల టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన శ్రీనివాస కల్యాణోత్సవ కార్యక్రమం కమనీయంగా జరిగింది. శోభాయమానంగా తీర్చిదిద్ది, చూడముచ్చట గొలిపే కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లకు మహబూబ్‌నగర్‌కు చెందిన పండితుడు శ్రీనివాసచార్యులు సాంప్రదాయ బద్ధంగా కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. కల్యాణోత్సవానికి ముందు స్వామి అమ్మవారి ఉత్సవ మూర్తులకు అభిషేకం నిర్వహించారు. కల్యాణోత్సవాన్ని తిలకించడానికి గోవింద, అయ్యప్ప మాలధారులతో పాటు పట్టణానికి చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. గోవిందనామ స్మరణంతో టీటీడీ ప్రాంగణం మార్మోగింది. కల్యాణోత్సవ వేడుకలను కన్నులారా వీక్షించి తన్మయత్వం పొందారు.

పుష్పం, పత్రం సమర్పయామి..

కల్యాణోత్సవానికి ముందు తిరుమల తిరుపతి శ్రీ వెంకటేశ్వరస్వామి పూజ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పద్మావతి అమ్మవారికి, వేంకటేశ్వర స్వామి ఉత్సవ మూర్తులకు నిర్వహించిన పుష్పార్చన నయనానందకరంగా సాగింది. సుగంధ పరిమళాలు వెదజల్లే పలు రకాల పుష్పాలతో పాటు మరువం.. దవనం.. బిల్వం.. తులసి.. కదిరిపచ్చ.. తదితర పత్రాలతో పుష్పయాగ మహోత్సవం నేత్రపర్వంగా సాగింది. అనంతరం ఇష్టాశ్వర్య హోమం నిర్వహించారు. తెలిసీ, తెలియక జరిగిన దోషాల ప్రాయశ్చిత్తం కోసం పెద్దమొత్తంలో పుష్పాలు, పత్రాలు అమ్మవారికి, శ్రీవారికి సమర్పించారు.

జూపల్లికి ఎక్సైజ్, పర్యాటకం

- జూపల్లి కృష్ణారావు ఎక్సైజ్, పర్యాటక శాఖల కేటాయింపు
- మంత్రివర్గంలో ఉమ్మడి జిల్లాకు దక్కిన సముచిత స్థానం
- నల్లమల, సోమశిల పర్యాటక అభివృద్ధికి అవకాశం

సాక్షి, నాగర్‌కర్నూల్: రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి పదవి మరోసారి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకే దక్కింది. నూతనంగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వంలో రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, పర్యాటక, పురావస్తు శాఖ మంత్రిగా కొల్లాపూర్ ఎమ్మెల్యే జూపల్లి కృష్ణారావుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కట్టబెట్టారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంతో పాటు, తాజాగా మరోసారి పాలమూరు జిల్లాకే ఆ శాఖల బాధ్యతలు రావడంతో నల్లమల ప్రాంతం, ఇక్కడి విశిష్టమైన వన, జంతు సంపద, ఎకో టూరిజం, కృష్ణాతీర ప్రాంతాల అభివృద్ధిపై జిల్లావాసుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. కొత్త ప్రభుత్వ పాలనలో ఉమ్మడి జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, దర్శనీయ స్థలాలు, ప్రకృతి రమణీయ ప్రదేశాల అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించి.. అభివృద్ధి పనులు కొనసాగుతాయన్న ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



ఆక్టోపస్ వ్యూ పాయింట్

ఎకో టూరిజంతో మేలు..

ప్రకృతి రమణీయ ప్రాంతాలు, సహజసిద్ధమైన వనాలు, వన్య మృగాలను సంరక్షిస్తూనే పర్యాటకులను ఆకర్షించే ఎకో టూరిజం అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టిసారించాలన్న డిమాండ్ స్థానికుల్లో నెలకొంది. ప్రధానంగా నల్లమల అభయారణ్యంలో పర్యాటకులు, సందర్శకుల ద్వారా పర్యావరణానికి ఇబ్బంది లేకుండా ఎకోటూరిజం ద్వారా అమూల్యమైన వృక్షసంపద, వన్యప్రాణులను వీక్షించేందుకు ఏర్పాట్లు చేయాల్సి ఉంది. ఇప్పటికే అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ప్రాంతంలో టైగర్ స్టే ప్యాకేజీ, టైగర్ సఫారీ, వ్యూ పాయింట్ వీక్షణం కొనసాగుతున్నా పర్యాటకులకు అవసరమైన ఏర్పాట్లు పూర్తిస్థాయిలో లేవు. అలాగే కృష్ణాతీర ప్రాంతంలోని సోమశిల, అమరగిరి, మంచాలకట్ట, మల్లేశ్వరం తదితర తీరప్రాంతాల్లో కాటేజీలు, బోటింగ్ సౌకర్యం కల్పించాల్సి ఉంది. ఎకో టూరిజం, పర్యాటక ప్రాంతాల అభివృద్ధి ద్వారా స్థానికంగా ఉన్న యువత, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అవకాశం దక్కనుంది.



నల్లమల అటవీప్రాంతం

పర్యాటకం రంగంపై..

ఉమ్మడి పాలమూరు జిల్లావ్యాప్తంగా పర్యాటక అభివృద్ధికి విస్తృత అవకాశాలున్నాయి. పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద నిర్మించిన భారీ రిజర్వాయర్ల వద్ద బోటింగ్ ఏర్పాటు, సౌకర్యాల కల్పనతో పెద్దఎత్తున పర్యాటకలను ఆకర్షించేందుకు ఆస్కారం ఉంది. పురాతన ఆలయాలు, ప్రముఖ పుణ్యక్షేత్రాల వద్ద సౌకర్యాల కల్పనతో పర్యాటకం పెరగనుంది. జోగులాంబ శక్తిపీఠం, నల్లమలలోని శైవక్షేత్రాలు, శ్రీశైల ఉత్తరద్వారంగా పేరొందిన ఉమామహేశ్వర క్షేత్రం, మన్యంకొండ తదితర ప్రాంతాలను పర్యాటకంగా మరింత అభివృద్ధి పర్చాల్సి ఉంది. పురావస్తు శాఖ సైతం జూపల్లి పరిధిలోనే ఉండగా.. జోగులాంబ శక్తిపీఠం సమీపంలోని పురాతన బ్రహ్మదేవాలయాలు, క్షేత్ర అభివృద్ధిపై మరింత దృష్టిసారించాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



'తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం ఏర్పడిన ప్రజా ప్రభుత్వంలో తొలి విడతలో మంత్రిగా ప్రజలకు సేవలందించే అవకాశం దక్కింది. రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కృషిచేస్తా. పాలమూరులోని నల్లమల ప్రాంతం, ఎకో టూరిజం, కృష్ణాతీర ప్రాంతాలు, సోమశిల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తా. పర్యాటక రంగంలో రాష్ట్రాన్ని ముందు వరుసలో ఉంచేందుకు అందరి సహకారంతో ముందుకెళ్తాను.'

– జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ఎక్సైజ్, టూరిజం, ఆర్కియాలజీ శాఖల మంత్రి

క్లుప్తంగా

చెట్టుకు ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య


శ్రీనివాసులు(ఫైల్)

లింగాల: మండలంలోని దారారం చెందిన ఆవుల శ్రీనివాసులు(43) ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆవుల శ్రీనివాసులు శుక్రవారం కుటుంబసభ్యులకు తెలియకుండా ఇంటి నుంచి వెళ్లి పోయాడు. వ్యక్తి గురించి కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. గ్రామానికి సమీపంలో ఉన్న పచ్చగట్టు వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడగా గమనించిన కొంతమంది కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి కొంతకాలంగా కడుపునొప్పి, ఇతర అనారోగ్య సమస్యలు ఉండడంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

పొలం పనులు చేస్తూ కూలీ మృతి


కురుమన్న (ఫైల్)

అమరచింత: పొలం పనులకు వెళ్లిన కూలీ కురుమన్న (49) అక్కడికక్కడే ఆకస్మికంగా మృతి చెందిన ఘటన మండలంలోని పాంరెడ్డిపల్లెలో చోటు చేసుకుంది. పాంరెడ్డిపల్లెకు చెందిన కురుమన్న వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శనివారం గ్రామానికి చెందిన సంజీవరెడ్డి పొలానికి నారుమడి కోసం చదును చేయడానికి వెళ్లాడు. పొలంలో పనిచేస్తుండగా అకస్మాత్తుగా కిందపడ్డాడు. స్పృహ కోల్పోయిన ఆయనను ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లు ధృవీకరించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు దుర్మరణం

బల్మూర్: వ్యవసాయ పొలంలో వేరుశనగ పంటకు నీరు పారించే క్రమంలో విద్యుదాఘాతానికి గురై రైతు దుర్మరణం చెందిన సంఘటన మండలంలోని రాంనగర్ వద్ద శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు జబ్బు లచ్చయ్య(45) తన వ్యవసాయ పొలంలో వేరుశనగ పంట సాగుచేశాడు. శనివారం సాయంత్రం ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ అంతరాయంతో బోరు మోటార్ నిలిచిపోయింది. దీన్ని చూడటానికి ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు రైతు వెళ్లగా అప్పటికే తెగిపడి ఉన్న విద్యుత్ తీగలను గమనించక వాటిపై కాలు పెట్టడంతో షాక్‌తో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. తన భర్త ఎంతకు రాకపోవడంతో భార్య పద్మమ్మ వచ్చి చూడగా విగతజీవిగా పడి ఉండటంతో బోరున విలపించింది. గమనించిన చుట్టుపక్కల రైతులు వచ్చి ఆస్పత్రికి తరలించే ఏర్పాట్లు చేయగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. మృతునికి భార్యతో పాటు కూతురు, కుమారుడు ఉన్నారు.

రోటోవేటర్‌లో పడికూలీ..

అడ్డాకుల: మూసాపేట మండలం పోల్కంపల్లిలో ప్రమాదవశాత్తు రోటోవేటర్‌లో పడి కూలీ దుర్మరణం చెందాడు. ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చౌదర్‌పల్లి దశరథ(48) గ్రామంలో కూలీ పనులు చేసేవాడు. అప్పుడప్పుడు ట్రాక్టర్ కూడా నడిపేవాడు. ఈక్రమంలో శనివారం గ్రామానికి చెందిన బయ్య కృష్ణయ్య ట్రాక్టర్‌తో ఓ రైతు పొలంలో కరిగెట చేయడానికి వెళ్లాడు. పొలంలో ట్రాక్టర్ రోటోవేటర్ ద్వారా కరిగెట చేస్తుండగా అనుకోకుండా ట్రాక్టర్ ఆగిపోయింది. ఈక్రమంలో దాన్ని చూసేందుకు వెనక్కి రాగా దురదృష్టవశాత్తు రోటోవేటర్‌లో పడిపోవడంతో అందులో ఇరుక్కుని దుర్మరణం చెందాడు. మృతునికి భార్య లక్ష్మమ్మ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. దశరథ మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హత్య కేసులో నిందితుడికి రిమాండ్

జడ్చర్ల: మహిళ హత్య కేసులో నిందితుడిని శనివారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రమేశ్‌బాబు తెలిపారు. సీఐ వివరాల మేరకు.. జడ్చర్ల మండలం తంగెళ్లపల్లికి చెందిన రాఘవేందర్, బాదేపల్లికి చెందిన ఉమాదేవిలు భార్యాభర్తలు. వీరి మధ్య విభేదాలు రావడంతో విడాకులు తీసుకుని విడిగా ఉంటున్నారు. ఈనెల 30న ఓటు వేసేందుకు ఉమాదేవి తంగెళ్లపల్లికి వెళ్లగా.. రాఘవేందర్, ఆమె మధ్య గొడవ చోటుచేసుకుంది. ఈ క్రమంలో కర్రతో ఉమాదేవి తలపై కొట్టడంతో తీవ్రంగా గాయపడింది. ఆమెను హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఈనెల 5న మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. శనివారం నిందితుడు రాఘవేందర్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

..అనే నేను

ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా గెలుపొందిన వారితో శనివారం అసెంబ్లీలో ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఓవైసీ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి (కొడంగల్), మంత్రి జూపల్లి కృష్ణారావుతో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేశారు.


పర్ణికారెడ్డి, నారాయణపేట


వాకిటి శ్రీహరి, మక్తల్


జి.మధుసూదన్‌రెడ్డి, దేవరకద్ర


యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, పాలమూరు


జనంపల్లి అనిరుధ్‌రెడ్డి, జడ్చర్ల


కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, నాగర్‌కర్నూల్


కసిరెడ్డి నారాయణరెడ్డి, కల్వకుర్తి


చిక్కుడు వంశీకృష్ణ, అచ్చంపేట


తూడి మేఘారెడ్డి, వనపర్తి


వీర్లపల్లి శంకర్, షాద్‌నగర్


బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, గద్వాల


విజయుడు, అలంపూర్

ప్రతిభావంతులకు ఉపకారం

- నేడు ఎన్ఎంఎంఎస్ అర్హత పరీక్ష
- నాగర్‌కర్నూల్‌లో మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు
- హాజరు కానున్న 649 మంది విద్యార్థులు



కందనూలు: ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులు చదువు కొనసాగించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఏటా నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్ష నిర్వహిస్తూ.. ప్రతిభావంతులైన విద్యార్థులను ఎంపిక చేస్తోంది. వారికి ఐదేళ్ల పాటు ఉపకార వేతనం అందిస్తూ చదువులో ప్రోత్సహిస్తోంది. ప్రభుత్వ, స్థానిక సంస్థలు, ఎయిడెడ్ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్షకు అర్హులు. ఎంపికైన విద్యార్థులకు ఇంటర్ పూర్తయ్యే వరకు ఉపకార వేతనం అందిస్తారు. మెంటల్ ఎబిలిటీ (ఎంఏటీ), స్కాటిస్టిక్ అప్టిట్యూడ్ టెస్ట్ (ఎస్ఏటీ) విభాగాల్లో పరీక్ష నిర్వహిస్తారు. అనంతరం మెరిట్ ఆధారంగా ఉపకార వేతనాలకు విద్యార్థులను ఎంపిక చేస్తారు.

ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్స్..

రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన కుల ధ్రువీకరణ పత్రాలు గల ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు మాత్రమే ఈ పరీక్షకు అర్హులు. ఈ ఏడాది నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి 649మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఆదివారం ఉదయం 9:30నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 236 మంది, బాలుర ఉన్నత పాఠశాలలో 217, బాలికల పాఠశాలలో 196 మంది పరీక్ష రాయనున్నారు. అర్హత పరీక్షకు రిజిస్టర్ చేసుకున్న విద్యార్థులు యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ ద్వారా ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లు పొందవచ్చని అధికారులు తెలిపారు. పరీక్ష సమయానికి గంట ముందే విద్యార్థులు కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

ఏటా రూ.12వేల చొప్పున..

ఉపకార వేతనానికి ఎంపికైన విద్యార్థులకు ఏటా రూ.12వేల చొప్పున విడతల వారీగా అందిస్తారు. విద్యార్థుల బ్యాంకు ఖాతాలో స్కాలర్‌షిప్ నిధులు జమయ్యేలా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఎంపికైన వారు సంబంధిత ప్రధానోపాధ్యాయుల ద్వారా బ్యాంకు ఖాతా నంబర్లు పరిశీలన చేసుకుని అందించాల్సి ఉంటుంది.

అన్ని ఏర్పాట్లు చేశాం



ఎన్ఎంఎంఎస్ అర్హత పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేశాం. పరీక్ష రాసే విద్యార్థులు సంబంధిత పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయుల సూచనలు, సలహాలు పాటించాలి. ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాయాలి. – గోవిందరాజులు, డీఈఓ

మహబూబ్‌నగర్ జిల్లాలో 570మంది..

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ అర్హత పరీక్షకు మహబూబ్‌నగర్ జిల్లాలో 570 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. పరీక్ష నిర్వహణకు గాను జిల్లా కేంద్రంలోని బీపీహెచ్ఎస్, మోడల్ బేసిక్, గాంధీరోడ్డు పాఠశాలల్లో కేంద్రాలను ఏర్పాటు చేశారు.

ఆటో బోల్తా : ముగ్గురికి గాయాలు

అచ్చంపేట రూరల్: ఆటో అదుపు తప్పి బోల్తాపడిన ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలైన ఘటన అచ్చంపేట మండలం నడింపల్లి శివారులో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. ఉప్పునుంతల మండలం వెల్టూరుకు చెందిన ఎడ్ల నిరంజన్, నారమ్మ, పార్వతమ్మతో పాటు కుటుంబ సభ్యులు బల్మూర్ మండలంలోని పోలిశెట్టిపల్లికి ఆటోలో వెళ్తుండగా.. నడింపల్లి గ్రామ సమీపంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో నిరంజన్, నారమ్మ, పార్వతమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108కి సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను అచ్చంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ముగ్గురిని నాగర్‌కర్నూల్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఈ విషయమై ఎలాంటి కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.


గాయపడ్డ క్షతగాత్రులు

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

కొత్తకోట రూరల్: రోడ్డు దాటుతున్న మహిళను కారు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన కొత్తకోట మండలం కనిమెట్ట స్టేజీ ఎన్‌హెచ్ 44పై శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి వివరాల మేరకు.. ఆత్మకూర్ పట్టణానికి చెందిన విజయలక్ష్మి కనిమెట్ట నుంచి ఆత్మకూర్‌కు వెళ్లేందుకు గాను రోడ్డు దాటుతుండగా.. కర్నూల్ వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ప్రమాదంలో ఆమెకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు 108లో వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పంట మార్పిడి.. మంచి దిగుబడి


మాగనూర్ శివారులో సాగు చేసిన వేరుశనగ పంట


వడ్వాట్ శివారులో సాగుచేసిన వేరుశనగ పంట

- ఒకే పంట సాగుతో రైతులకు నష్టం
- పంటల మార్పుతో అధిక లాభాలకు అవకాశం

మాగనూర్: పంట మార్పిడి విధానంతో రైతులకు లాభం చేకూరుతోంది. వేసిన పంటలను మళ్లీ వేయడం వల్ల నష్టం వాటిల్లుతుందని వ్యవసాయశాఖ మండల ఇన్‌చార్జి అధికారి సుదర్శన్‌గౌడ్ పేర్కొంటున్నారు. పంట మార్పిడి వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయని వివరించారు.

పంట మార్పిడి వల్ల కలిగే ప్రయోజనాలు..

- పంట మార్పిడి మూలంగా నేల భౌతిక స్థితి మెరుగుపడుతుంది.
- భూమిలో నీటి నిల్వ ఉండే శక్తి కలిగి, భూసారం వృద్ధి చెందుతుంది.
- చీడ పీడలు దూరమవుతాయి.
- సస్యరక్షణకు వినియోగించే మందుల ఖర్చు తగ్గుతుంది.
- శిలీంధ్ర తెగుళ్లను దూరం చేయవచ్చు.
- బీజాలు, వాటి అవశేషాలు, వానపాముల అభివృద్ధి కూడా ఎక్కువగానే ఉంటుంది.
- కీటకాల గుడ్లు వృద్ధి చెందకుండా నివారించవచ్చు.
- ఎంటలో నాణ్యత పెరిగి ధర ఎక్కువగా పొందే అవకాశం ఉంది.

సూచనలు..

- జొన్నపంట సాగు చేసిన పొలంలో మిరప వేయవద్దు.
- వేరుశనగ సాగుచేసిన తర్వాత మళ్లీ అదే పంట వేసుకోరాదు. దీని వల్ల ఎర్ర గొంగళి పురుగు, శనగ పచ్చ పురుగు ఆశించవచ్చు.
- శనగ తర్వాత ఆముదంలో పంట మార్పిడి చేసుకోవచ్చు.
- నులి పురుగులు ఉన్న ప్రాంతాల్లో వంగ, వెండ, టమాట, ఉలవలు, మినుము, పెసర పంటలు వేస్తే, అవి వాటిని మరింత అభివృద్ధి చేస్తాయి. వాటిని పంట మార్పిడి చేయరాదు.


రైతులు పాటించాల్సింది..

- భూమిలో తేమ ఎక్కువ కాలం నిల్వ చేసే శక్తి ఉన్నప్పుడు పంట తర్వాత వేరే పంట వేసి ఏడాదిలో రెండు పంటలు పండించుకోవాలి. తేలిక పాటి నేలలు, ఎర్ర, ఇసుక నేలల్లో మిశ్రమ పంటలు వేసుకోవాలి.
- వర్షాలు అధికంగా కురిసే ప్రాంతాల్లో ఎక్కువ పంటకాలం కలిగిన కంది, నువ్వులు, వేరుశనగ వంటి పంటలు వేసుకోవాలి.
- బంకమన్ను శాతం ఎక్కువగా ఉంటే ఎర్రనేలలు, నల్లరేగడి నేలలు, పల్లపు ప్రాంతాల్లో పంట మార్పిడి చేసి ఏడాదిలో రెండు పంటలు పండించుకోవాలి.

జాగ్రత్తలు..

- పంట మార్పిడిలో నేల ఉపరితలాన్ని పూర్తిగా కప్పే పంటలను ఎంపిక చేసుకోవాలి.
- శనగ, బబ్బెర, మినుము, ఉలవలు, పెసర పంటలు వేయడంతో నేలను కప్పి ఉంచుతాయి. కలుపు మొక్కలను నివారించవచ్చు.
- లెగ్యూమ్ జాతి (పప్పు దినుసులు) పైర్లపై వేయడం వల్ల రైజోబియం బుడిపెలు ఏర్పడతాయి. ఇవి గాలిలోని నత్రజనిని భూమిలో స్థిరీకరించి నేలను సారవంతం చేస్తాయి. ఈ జాతి పంటలను పచ్చిరొట్ట ఎరువులుగా వాడుకోవచ్చు.
- పత్తి పైరును మినుము, పెసర వంటి పంటతో మార్పిడి చేయడం వల్ల దోమ ఉధృతి తగ్గుతుంది.
- వేరుశనగ తర్వాత జొన్న, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు వంటి ఆరుతడి పంటలు పండించాలి. దీనివల్ల వేరుశనగ పంటలను ఆశించిన ఆకుముడత ఉధృతిని తగ్గించవచ్చు.
- వరిపైరు తర్వాత పుప్పు ధాన్యాల పైర్లను, నూనె గింజల పైర్లను పండించడం వల్ల వరి పంటకు ఆశించే టుగ్రో వైరస్, దోమ పోటులను నివారించవచ్చు.

పప్పు దినుసుల సాగుకు ప్రాధాన్యత..



ఒకే రకమైన పంటను ఏళ్ల తరబడి వేయడం వల్ల రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తెలిసినవే. ఇలాంటి సమయంలో పంట మార్పిడి అనేది తప్పనిసరి. ఆ దిశగా ఈ ఏడాది పప్పు దినుసులు, నూనె ధాన్యాలు, కూరగాయల పంటలకు ప్రాధాన్యత ఇస్తున్నాం. – సుదర్శన్‌గౌడ్, ఇన్‌చార్జి ఏఓ, మాగనూర్

డీఆర్‌టీలో ఎంబీ మిషనరీకి అనుకూల తీర్పు


మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

జడ్చర్ల టౌన్: హైదరాబాద్ డెట్ రికవరీ ట్రిబ్యునల్‌లో ఎంబీ మిషనరీ విజయం సాధించిందని, ఈ మేరకు 44వ నంబర్ జాతీయ రహదారిపై కావేరమ్మపేట వద్ద ఉన్న ఎంబీ మెడికల్ ఆస్తులు తిరిగి స్వాధీనం చేసుకుంటున్నట్లు న్యాయవాది జాన్‌వెస్లీ తెలిపారు. శనివారం సాయంత్రం ఎంబీ మెడికల్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1992లో ఇక్కడ చిన్న క్లినిక్ ప్రారంభించి అనతికాలంలోనే పెద్ద ఆస్పత్రిగా మార్చి పేదలకు మెరుగైన వైద్యం అందించారన్నారు. ఈ క్రమంలోనే 2006లో మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలనే సంకల్పంతో పంజాబ్ నేషనల్ బ్యాంక్ అనుబంధ బ్యాంకుల్లో రుణానికి దరఖాస్తు చేయగా.. రూ.35 కోట్ల ప్రాజెక్ట్ మంజూరైందని, వీటిని 5 విడతలుగా ఒక్కో విడతకు రూ.7 కోట్ల చొప్పున ఇచ్చేందుకు బ్యాంకు అంగీకరించి.. మొదటి విడత చెల్లించిందన్నారు. ఆ నిధులతో కొన్ని నిర్మాణాలు ప్రారంభించామని, అయితే పెరిగిన ధరల కారణంగా పూర్తిచేయలేకపోయామని, అదే సమయంలో సరైన నిర్మాణాలు లేని కారణంగా ఇండియన్ మెడికల్ కౌన్సిల్ అనుమతి రద్దు చేసిందన్నారు. నాటి నుంచి బ్యాంక్ నుంచి వచ్చిన మొదటి విడత డబ్బులు రూ.7 కోట్లకు వడ్డీ పెరిగి 2018 వరకు రూ.22 కోట్లకు చేరిందన్నారు. వడ్డీ, అసలు కట్టలేనందున బ్యాంక్ కోర్టును ఆశ్రయించగా.. హైకోర్టు బ్యాంక్‌కు అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. ఆ తర్వాత జరిగిన యాక్షన్‌లో సాయిరెడ్డి మరికొందరు కలిసి రూ.28.75 కోట్లకు మిషనరీ స్థలాన్ని పొందారన్నారు. వాస్తవానికి కొన్ని నిబంధనలు పాటించనందున ఎంబీ ప్రాపర్టీస్ సంస్థ హైదరాబాద్‌లోని డెట్ రికవరీ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించామని, నాలుగేళ్ల పోరాటం తర్వాత ఈ నెల 6న డీఆర్‌టీ కోర్టు ఎంబీ మిషనరీకి అనుకూల తీర్పు ఇవ్వడంతోపాటు స్థలాన్ని, ఆస్తులను వెంటనే స్వాధీనం చేసుకోవాలని సూచించారన్నారు. కోర్టు ఉత్తర్వుల మేరకు స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చి ఆస్తులను స్వాధీనం చేసుకుంటున్నామన్నారు. సమావేశంలో ఎంబీసీ సంస్థ డైరెక్టర్ జార్జ్, నాగర్‌కర్నూల్ ధర్మరాజు, జడ్చర్ల ఆంద్రూస్ తదితరులు పాల్గొన్నారు.

‘ఖిల్లా’లో చిరుత సంచారం?


ఖిల్లాఘనపురం సమీపంలో లేగ దూడ కళేబరం


లేగ దూడను చంపిన ప్రదేశంలో చిరుత జాడ

ఖిల్లాఘనపురం: మండల కేంద్రానికి సమీపంలో చిరుత సంచరిస్తుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రం నుంచి మహబూబ్‌నగర్ వెళ్లే ప్రధాన రోడ్డుకు పక్కన వెంకటాంపల్లికి చెందిన సిద్ది పర్వతాలు పశువుల పాక ఉంది. అయితే శుక్రవారం రాత్రి చిరుత అక్కడికి వచ్చి సిద్ది పర్వతాలు పశువుల పాక దగ్గర లేగ దూడను తీసుకువచ్చి సమీపంలోని విష్ణు అనే రైతు వేరుశనగ పంటలో వేప చెట్టు దగ్గర చంపి తిని మిగతా భాగాన్ని వేరుశనగ పంటలోనే వదిలి వెళ్లి పోయింది. శనివారం తెల్లవారుజామున వేరుశనగ పంటకు స్ప్రింక్లర్లు మార్చేందుకు వచ్చిన రైతు గమనించి వెంటనే పర్వతాలుకు విషయం చెప్పారు. సమాచారం తెలుసుకున్న ఫారెస్టు డిప్యూటీ రేంజ్ అధికారి భాస్కరాచారి సిబ్బంది వంశీ, ఆంజనేయులుతో వచ్చి పరిశీలించారు. లేగదూడను చంపింది హైనా అయ్యి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. పొలాలకు వెళ్లే రైతులు, రోడ్డుమీదితండా, మల్కిమియాన్‌పల్లి, ఖిల్లాఘనపురం గ్రామాలకు చెందిన ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ అధికారులు సూచించారు.

ఎమ్మెల్యే వాకిటి ఔదార్యం

మక్తల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ మహిళను మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి తన వాహనంలో ఆస్పత్రికి తరలించి ఔదార్యం చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. జడ్చర్ల ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద శనివారం నడుచుకుంటూ వెళ్తున్న మహిళను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడింది. హైదరాబాద్ నుంచి మక్తల్‌కు వస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి.. 108కు సమాచారం ఇచ్చేందుకు యత్నించగా ఫలితం లేకపోయింది. దీంతో ఎమ్మెల్యే తన కారులో క్షతగాత్రురాలిని మహబూబ్‌నగర్ ఎస్వీఎస్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. గాయపడిన మహిళను స్వయంగా తన వాహనంలో ఆస్పత్రికి తరలించిన ఎమ్మెల్యేకు పలువురు ధన్యవాదాలు తెలిపారు.


క్షతగాత్రురాలిని ఆస్పత్రిలో చేర్పిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

వివాహేతర సంబంధం నేపథ్యంలోనే హత్య?

జడ్చర్ల: జడ్చర్ల మండలంలోని ఆలూరు గ్రామానికి చెందిన మల్లేష్ గురువారం రాత్రి వ్యవసాయ పొలం వద్ద హత్యకు గురయ్యాడు. ఈ కేసును పోలీసులు ఛేదించినట్లు తెలిసింది. వివాహేతర సంబంధం నేపథ్యంలోనే హత్య చోటు చేసుకున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడయ్యింది. ఓ మహిళతో పాటు ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. హత్య కేసు దాదాపుగా కొలిక్కి వచ్చిందని, త్వరలోనే నిందితులను కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలిస్తామని సీఐ రమేశ్‌బాబు తెలిపారు.

పోలీసుల అదుపులో నిందితులు

‘మహో’నందం వెల్లివిరిసే..



అయిజ ఆర్టీసీ బస్టాండ్‌లో కిక్కిరిసిన మహిళా ప్రయాణికులు



జిల్లా కేంద్రంలో స్వీట్లు తినిపించి సంబరాలు చేసుకుంటున్న మహిళలు

- హర్షం వ్యక్తం చేస్తున్న మహిళలు
- రాష్ట్రంలో ఎక్కడికైనా ఉచితమే..
- మొదటి రోజు స్వీట్లు పంచి సంబురాలు

గద్వాల అర్బన్/అయిజ: సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని, అందులో భాగంగానే మహాలక్ష్మి పథకాన్ని అమలు చేశారని, ఈ పథకం మహిళలకు ఎంతో ఉపయోగ పడుతుందని జిల్లా కేంద్రంలోని 11వ వార్డు కౌన్సిలర్ వసీమాబేగం తెలిపారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు సర్వీసులను అందుబాటులోకి తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు వార్డులోని మహిళలతో కలిసి స్వీట్లు తినిపించి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సరితకు కౌన్సిలర్ వసీమాబేగం కృతజ్ఞతలు తలిపారు.

కిక్కిరిసిన బస్సులు.. కదిలొచ్చిన మహిళలు

కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్‌లో ఉచిత ప్రయాణం పథకాన్ని అమలు చేయడంతో తొలిరోజు వివిధ మండలాల నుంచి మహిళా ప్రయాణికులు మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌కు తరలివచ్చారు. దీంతో ఆర్టీసీ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. తొలిరోజు కావడంతో ఉత్సాహంగా మహిళలు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేసేందుకు కదలొచ్చారు. ఆర్టీసీ బస్సుల్లో మగవారి సంఖ్య కంటే దాదాపు ఆడవారి సంఖ్య రెండు రెట్లు ఎక్కువ కనిపించింది. అప్పుడే ప్రారంభమైన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కార్యక్రమాన్ని తొలిసారిగా సద్వినియోగం చేసుకున్నందుకు మహిళల ముఖంలో ఆనందం తొణికిసలాడింది.

ఘనంగా సోనియా జన్మదిన వేడుకలు



ఎర్రవల్లి కూడలిలో సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

అలంపూర్: కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాగాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అలంపూర్ పట్టణంలోని గాంధీ చౌక్, పార్టీ కార్యాలయంలో సోనియా గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ మండల అ ధ్యక్షుడు రాము, ఇస్మాయిల్, ఆసీఫ్ ఖాన్, నర్సన్ గౌడు, మహేష్ గౌడ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఒకరికి ఒకరు తినిపించుకున్నారు. సోనియా గాంధీ చిత్రపటాన్ని పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

ఉండవెల్లి: మండలంలోని మండల కేంద్రం, తక్కశిల, కంచుపాడు గ్రామాల్లో సోనియా గాంధీ పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. సోనియా గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి, కేక్ కట్ చేశారు. కంచుపాడులో పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచులు నాగేష్, నాయకులు వెంకట్‌గౌడు, నాగరాజు, గోపాల్, రమేష్, నయ్యూం, బుచ్చిరెడ్డి, శేఖర్ రెడ్డి, దామోదర్ గౌడు, రవి, వెంకటేష్, ముక్తర్ బాషా పాల్గొన్నారు.

అయిజ: మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్‌లో సోనియా గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మధుకుమార్ మాట్లాడారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల కేంద్రంలో అలంపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జోగుల రవి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు సోనియా గాంధీ చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, శ్యామ్, నీలి శ్రీను, రాముడు, వెంకటేష్, మద్దిలేటి, అల్లబకాష్, ఉసేన్, తిమ్మారెడ్డి, భాస్కర్‌రెడ్డి ఉన్నారు.

మల్దకల్: మండలంలో మండలంలోని బిజ్వారం, అమరవాయి, నాగర్‌దొడ్డి, మల్దకల్, ఎల్కూరు గ్రామాలలో సోనియా గాంధీ చిత్రపటానికి నాయకులు శ్రీనివాసరెడ్డి, కృష్ణారెడ్డి, సత్యారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, గోపాల్, గోవిందులు పాలాభిషేకం చేశారు. అనంతరం పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేటీదొడ్డి: మండలంలోని నందిన్నెలో బస్టాండ్ దగ్గర కాంగ్రెస్ నాయకులు సోనియా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి పాలాభిషేకం చేశారు.

ధరూరు: మండలంలోని ఆయా గ్రామాలతో పాటు మండల కేంద్రంలోని బీసీఎస్ఆర్ కాంప్లెక్స్‌లో మాజీ మార్కెట్ యార్డు చైర్ పర్సన్ బండ్ల లక్ష్మీదేవి, ఎంపీపీ నజీమున్నీసా బేగంలు మండల నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్‌కట్ చేశారు. అంతకు ముందు సోనియాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జాకీర్, రాజారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కర్రెన్న, కుర్వ శ్రీను, బోయ మల్లి, వెంకటన్న, నర్సింహులు, బడుగు నర్సన్న,వెంకటేష్, సవారన్న, నాగన్న, దేవన్న, దావీదు, మదిలేటి, షాకీర్, రంగేష్, లాడెన్, చాకలి మల్లి, బాబు పాల్గొన్నారు.



నందిన్నెలో సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు



అలంపూర్‌లో సోనియా గాంధీ చిత్రపటానికి పాలతో అభిషేకిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గాయత్రి శ్రీనివాసులుకు ఘన సన్మానం



శాంతినగర్: వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్‌కు చెందిన గాయత్రి శ్రీనివాసులుకు రవీంద్ర భారతిలో ఘనంగా సన్మానించారు. గోసంరక్షణ, హిందూ సంస్కృతి, సంప్రదాయాలు, సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్న శ్రీనివాసులును సంస్కృతి పరిరక్షణ సేవాసమితి ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్రభారతిలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించి మెమొంటో అందజేశారు. దైవజ్ఞశర్మ, రాష్ట్ర గోసంరక్షణ సమితి అధ్యక్షుడు కరుణాకర్, కవి గాయకుడు, రచయిత దేవందర్‌గుప్త చేతులమీదుగా ఆయన మెమొంటో అందుకున్నారు. గాయత్రి శ్రీనుకు రాష్ట్రస్థాయిలో సన్మానం పొందడంతో బంధువులు, మిత్రుల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి.

ప్రయాణం.. ప్రమాదం



మల్దకల్: ఈ ప్రయాణం ఎంతో ప్రమాదకరంగా మారింది. ప్రైవేట్ వాహన డ్రైవర్లు, ప్రయాణికులు ఇంకా నిర్లక్ష్యం వీడలేదు. కూలీలు ప్రైవేటు వాహన దారులను ఆశ్రయించడంతో వారు ఆటోలు, బొలేరోలలో పరిమితికి మించి ప్రజలను చేరవేస్తూ వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. నిత్యం వివిధ గ్రామాలకు చెందిన కూలీలతో పాటు గద్వాల, ధరూరు, గట్టు ప్రాంతాల నుంచి గూడ్సు వాహనాలతో పాటు ప్యాసింజర్ వాహనాల్లో పరిమితికి మించి కూలీలను తరలిస్తున్నారు. గూడ్సు ఆటోలో ప్రయాణికులను చేరవేస్తున్న క్రమంలో చిన్నపాటి ప్రమాదాలు జరిగినా భారీగా మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది.

జోరుగా ఇసుక దందా

మాగనూర్: మండలంలోని పలు గ్రామాల్లో యథేచ్ఛగా ఇసుకదందా కొనసాగుతోంది. కొందరూ ఆక్రమార్కులు మందిపల్లి, గజ్జరందొడ్డి, అడవిసత్యరం, మాగనూర్ గ్రామాల్లోని వాగులనుంచి నిత్యం ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తూ అందిన కాడికి దోచుకుంటున్నారు. మాగనూర్ మండల పెద్దవాగు పరివాహక గ్రామాల్లో దందా జరుగుతున్నా.. స్థానిక అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలం నుంచి ఇతర ప్రాంతాలకు ఇసుక తరలుతున్న అధికారులు పట్టించుకోకపోవడంపై పలు అనుమానలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత రెవెన్యూ, పోలీసు అధికారులు స్పందించి ఇసుక అక్రమదందాపై ఉక్కుపాదం మోపాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయంపై రెవెన్యూ ఆర్ఐ శ్రీశైలంను వివరణ కోరగా.. ఇసుక అక్రమంగా తరలిస్తున్న అంశం తమ దృష్టికి రాలేదని ఈ రోజు నుంచే ఆయాప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చే యించి, ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుంటామని తెలిపారు.

భీమా కాల్వలో పేరుకపోయిన జమ్ము

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లి సమీపంలోని భీమా కాల్వలో జమ్ము, పిచ్చిమొక్కలు పేరుకపోవడంతో చివరి గ్రామాలకు సాగునీరు సక్రమంగా చేరడంలేదని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం రైతులు వరి నాట్ల కోసం తూకాలు పోస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కాల్వలో పేరుకపోయిన జమ్ము, పిచ్చిమొక్కలను ఉపాధిహామీ పథకం ద్వారా తొలగించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

క్రిస్మస్ కానుకల పంపిణీ



అమరచింత: క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని పట్టణానికి చెందిన ఉపాధ్యాయ దంపతులు వైడూర్య, ఆదాం నిరుపేద క్రైస్తవ మహిళలు, వితంతువులు, పాస్టర్లకు నూతన వస్త్రాలను శనివారం పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, వైస్ చైర్మన్ గోపి వాటిని అందించారు. దేవుడి దయతో మరిన్ని సామాజిక కార్యక్రమాలు చేస్తామన్నారు.

అయ్యప్ప భక్తుల పూజలు

ఆత్మకూర్: కార్తీకమాసం చివరి శనివారం సందర్భంగా అయ్యప్ప మాలధారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సింగంపేట శివారులోని అడవి ఆంజనేయస్వామి ఆలయంవద్ద పూజల్లో పాల్గొన్నారు. పట్టణంలో కొత్తగా నిర్మిస్తున్న అయ్యప్పస్వామి ఆలయంలో పూజా కార్యక్రమాలతోపాటు మాలధారులకు అన్నదానం నిర్వహిస్తున్నామని తెలిపారు.

చేప వంటకాల పేరిట మద్యం అమ్మకాలు

అమరచింత: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాల్వలో ప్రతి సంవత్సరం ఈత కోసం వెళ్లిన యువకులు మద్యం మత్తులో నీటి ప్రవాహానికి కొట్టుకుపోతూ ప్రాణాలను పోగొట్టుకుంటున్నారు. ఎడమ కాల్వ సమీపంలో చేప వంటకాల తయారీ ఉండటంతో ప్రాజెక్టు సందర్శనార్థం వస్తున్న పర్యాటకులతో పాటు సమీపంలోని ఆయా గ్రామాల యువకులతో నిత్యం కిటకిటలాడుతుంది. వీటికి తోడు కొంతమంది అక్రమంగా మద్యంను చేప వంటకాల గుడారాల్లో విక్రయిస్తుండటంతో రోజు రోజుకు సందర్శకుల సంఖ్య పెరుగుతుంది. మద్యం మత్తులో ప్రవహిస్తున్న కాల్వలో దిగే ప్ర యత్నాలు చేస్తున్నారు. నాలుగేళ్ల కిందట మద్యం విక్రయాలపై చర్యలు తీసుకున్న యంత్రాంగం ప్రస్తుతం పట్టించుకోవడం లేదు.

మోడువారినా.. అందమే!



పచ్చని చెట్ల మధ్య, పచ్చని పంటపొలాల మధ్యన మోడువారిన చెట్టు అందగా కనిపిస్తూ చూపరులను ఆకర్షిస్తోంది. పెద్దపోతులపాడు నుంచి మానవపాడుకు వెళ్లేదారిలో మోడువారిన చెట్టు దర్శనమిస్తోంది. ఈ దృశ్యాన్ని ‘సాక్షి’ తన కెమెరాలో బంధించింది.

– మానవపాడు

ఉసిరి చెట్టు కింద వనభోజనాలు



కొత్తకోట రూరల్: మండలంలోని ఆమడబాకులలో కొన్ని కుటుంబాలు గ్రామంలోని మామిడి తోటలో గల ఉసిరిచెట్టు కింద వనభోజనాలు చేశారు. కార్తీక మాసంలో ఉసిరి చెట్టుకు పూజలు చేసి అక్కడే భోజనాలు చేస్తే అశ్వమేధ యాగం చేసినంత ఫలితం దక్కుతుందని, అదేవిధంగా కార్తీకమాసంలో మహావిష్ణువు, లక్ష్మీదేవి ఉసిరి చెట్టులో కొలువై ఉంటారని ప్రజల నమ్మకం.

క్లుప్తంగా

దేవాదాయశాఖ మంత్రి నియామకంపై హర్షం

జోగుళాంబ శక్తిపీఠం: కొత్త ప్రభుత్వం కొలువుదీరిన నేపథ్యంలో రాష్ట్ర దేవదాయశాఖ మాత్యులుగా కొండా సురేఖను నియమించడంపై రాష్ట్ర దేవదాయశాఖ రాష్ట్ర అర్చక, ఉద్యోగ జేఏసీ కన్వీనర్ డీవీఆర్ శర్మ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనంద్ శర్మ, ఉద్యోగ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్యాంసుందర్‌లు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో విడతల వారీగా రాష్ట్ర ప్రభుత్వానికి ఆయా జిల్లా కేంద్రాలలో వేద పండితుల చేత వేదాశీర్వచనం ఇప్పిస్తూ మహత్తర కార్యక్రమం ఏర్పాటు చేసేందుకు జిల్లాల అర్చక ఉద్యోగులకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. నూతన ప్రభుత్వంపై రాష్ట్ర దేవదాయశాఖ ఎన్నో ఆశలు పెట్టుకుందని, నూతన ప్రభుత్వ పరిపాలనలో దేవదాయ శాఖ అర్చక ఉద్యోగులకు మరింత ప్రయోజనాలు చేకూరుతాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

బాధితునికి ఆర్థిక సాయం అందజేత



ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని చాగాపురం గ్రామానికి చెందిన చిన్న దేవన్న ఇటీవల ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి కిందపడటంతో తీవ్ర గాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధిత కుటుంబం నిత్యం వైద్య ఖర్చుల కోసం ఇబ్బందులు పడుతూ నిస్సహాయ స్థితిలో ఉండటంతో, ఈ విషయం తెలుసుకున్న జిల్లా సోషల్ రెస్పాన్స్ బులిటీ సంస్థ టీమ్ శనివారం చాగాపురానికి వెళ్లి బాధితున్ని పరామర్శించి రూ. 40వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో టీమ్ సభ్యులు మల్లేష్, నాగేష్, మురళి, రామన్న, అశోక్, వీరన్న, ఆంజనేయులు ఉన్నారు.

రోడ్డుపై మురుగు



కేటీదొడ్డి: మండల కేంద్రంలో సీసీ రోడ్డుపై మురుగునీటి గుంతలతో వాహనాలు, పాదాచారులు ఇబ్బందులు పడుడుతున్నారని మండల ప్రజలు పేర్కొన్నారు. అంగన్‌వాడీ రోడ్డు నుంచి ఇందిరమ్మ కాలనీకి వెళ్తున్న సీసీ రోడ్డుపై నీరు నిల్వ ఉన్నా అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. నీరు నిల్వ ఉండటంతో పాదాచారులు, వాహనదారులు రాకపోకలకు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు భద్రకాళి వీరభద్రస్వామి కల్యాణం

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని వీరభద్ర స్వామి ఆలయంలో ఆదివారం భద్రకాళీ వీర భద్ర స్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు రమేష్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ధ్వజారోహణం, విఘ్నేశ్వర పూజ, గంగాభిషేకం ఉంటుందని, అనంతరం కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం వీర శైవులు సంప్రదాయ నందికోల సేవతో స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు జిల్లా కేంద్రంలోని పురవీధుల్లో రథోత్సవం ఉంటుందని పేర్కొన్నారు. వీరశైవులు, కులబంధులు, ప్రజలు ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

అయ్యప్ప స్వాముల ఇరుముడి



ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప మాలాధారులు నలు గురు ఇరుమడి కట్టుకున్నారు. గురుస్వాములు సూర్యకాంతారెడ్డి ఆధ్వర్యంలో ఇరుముడిని దరించారు. కార్యక్రమంలో స్వాములు మురళిధర్‌రెడ్డి, రాజశేఖర్, రామోహన్ పాల్గొన్నారు.

హామీల అమలునపై హర్షం

ఎర్రవల్లిచౌరస్తా: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలలో భాగంగా శనివారం రెండు గ్యారంటీ పథకాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమలు చేయడంతో ఇటిక్యాల, ఎర్రవల్లి మండలాల మహిళలు, కాంగ్రెస్ నా యకులు, వివిధ ప్రజా సంఘాల వారు హర్షం వ్యక్తం చేశారు. మహిళలకు మహలక్ష్మి పథకం ద్వారా రాష్ట్రంలోని ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించారని పేర్కొన్నారు. చేయూత పథకం ద్వారా రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్యసాయం కింద రూ.10 లక్షల ఉచిత కార్పొరేట్ వైద్యం పేదలకు అందించేందుకు శ్రీకారం చుట్టి అమలు చేశారని తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

భక్తులతో కిక్కిరిసిన ఆదిశిలా క్షేత్రం



ఆదిశిలా క్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు

మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న ప్రధాన దేవాలయాల్లో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మల్దకల్ స్వయంభూ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి, సద్దలోనిపల్లి కృష్ణస్వామి, కుర్తిరావులచెర్వు గట్టు తిమ్మప్ప, శేషంపల్లి శివసీతా రామస్వామి, చర్లగార్లపాడు వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా అర్చకులు రమేషాచారి, మధుసూదనాచారి, రవిచారిలు స్వామి వారికి అభిషేకాలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కొంత మంది భక్తులు స్వామి వారికి దాసంగా నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కృష్ణస్వామి ఆలయంలో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, అరవిందరావు, చంద్రశేఖర్‌రావు, మండల నాయకులు సత్యారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సీతారామిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, బాబురావు, ఆలయ సిబ్బంది ఉరుకుందు, శ్రీను, రంగస్వామి, శివమ్మ, కృష్ణ ఉన్నారు.

నేడు కార్తీకమాస వనభోజన మహోత్సవం



ఆహ్వానపత్రికలను విడుదల చేస్తున్న నాయకులు

గద్వాల అర్బన్: ప్రతి ఏడాది మాదిరిగా ఈ ఏడాది కూడా రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో కార్తీకమాస వనభోజన మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆ సమితి జిల్లా అధ్యక్షుడు వెంకటరాజ రెడ్డి తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని రెడ్డిసేవా సమితి వసతి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివారం ఉదయం 10గంటల నుంచి జిల్లా కేంద్రంలోని నది అగ్రహారంలోని క్రిష్ణానది ఒడ్డున కార్తీకమాస వనభోజన మహోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. రెడ్డి కులస్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం వనభోజన మహోత్సవానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను వారు విడుదల చేశారు. సమావేశంలో రెడ్డి సేవాసమితి నాయకులు రంగారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, నరేందర్ రెడ్డి, పురుషోత్తం, మహిళా విభాగం నాయకురాలు రాధ, శ్రీదేవి, దివ్యజ్యోతి ఉన్నారు.

‘రక్షణ గోడ ఏర్పాటు చేయండి’



మన్నాపురం చెరువుకట్టపై ప్రమాదకరంగా రోడ్డు

ధరూరు: మండలంలోని మన్నాపురం చెరువు కట్టపై రోడ్డుకు ఇరు వైపులా రక్షణ గోడ ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. నిత్యం ఈ మార్గం కుండా వందలాది వాహనాలు తిరుగుతూ ఉంటాయి. ఏ మాత్రం ఆదమరిచినా ప్రమాదం జరగడం ఖాయగా కనిపిస్తోంది. రెండేళ్ల క్రితం ఓ ఆటో చెరువుతోకి దూసుకెళ్లడంతో అందులో ఉన్న ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. ఘోరం జరగక ముందే సంబంధిత శాఖ అధికారులు స్పందించాల్సి అవసరం ఉంది. ధరూరు నుంచి మన్నాపురం వెళ్లే క్రమంలో చెరువు కట్టపైకి వెళ్లే మార్గంలో ప్రమాదకర మలుపు ఉంది. అక్కడ సూచిక బోర్డుతో పాటు స్పీడ్ బ్రేకర్‌ను ఏర్పాటు చేయాలి. అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఏళ్ల తరబడి సమస్య ఉన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

‘డ్రెయినేజీలు నిర్మించండి’

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని బుడమర్సు గ్రామంలో డ్రెయినేజీలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామంలోని ఆరో వార్డులో ప్రభుత్వ పాఠశాల సమీపంలోని రెండో లైన్‌లో సీసీ రోడ్డు వేసి డ్రెయినేజీ నిర్మించకపోవడంతో రోడ్డుపైనే మురుగునీరు ప్రవహిస్తోంది. కాలినడకన వెళ్లే ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. రోడ్డుపై మురుగునీరు నిల్వ ఉంటూ దుర్గంధం వెదజల్లుతోందని గ్రామస్తులు కురువ మద్దిలేటి, భీమేష్, ఉప్పరి మధు, బింగి సురేష్‌లు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ విషయమై మండల, జిల్లా పంచాయతీరాజ్ శాఖ అధికారులు స్పందించి డ్రెయినేజీ కాల్వలు నిర్మించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డుపై నిలిచిన మురుగునీటిని చూపుతున్న గ్రామస్తులు

ముసుగు తొలగలె..



ఎన్నికల కోడ్ నేపథ్యంలో దివంగత రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేస్తారు. గోడలపై ఆయా పార్టీలకు సంబంధించిన గుర్తులు, రాతలు చెరిపేస్తారు. అయితే ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ఆయా పార్టీలకు సంబంధించిన నాయకుల విగ్రహాలపై వేసిన ముసుగులు తొలగించాల్సి ఉంటుంది. అయితే ఎన్నికల కోడ్ ముగిసి ఐదు రోజులైన ఇప్పటి వరకు పలుచోట్ల విగ్రహాలపై వేసిన ముసుగులు తొలగించలేదు. జిల్లా కేంద్రంలో జమ్మిచేడులోని దివంగత మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి విగ్రహంపై వేసిన ముసుగును తొలగించలేదు. అధికారుల పనితీరుపై పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ దృశ్యం శనివారం సాక్షి కంటపడింది.

– గద్వాల అర్బన్

కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లతో ప్రమాదం



చెన్నిపాడులో చెట్లపై ఉన్న విద్యుత్ తీగలు



చెన్నిపాడులో కంచెలేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

మానవపాడు: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు, జంతువులకు ప్రాణసంకటంగా మారింది. నిత్యం ప్రజలు సంచరించే ప్రదేశాల్లో విద్యుత్ తీగలు చెట్లపై, నివాస గృహాలపై ఉండటం, విద్యుత్ ట్రా న్స్‌ఫార్మర్లకు ఫెన్సింగ్ లేకపోవడం వల్ల ప్రజలకు, జంతువులకు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా యి. నిత్యం ప్రజల సంచరించే ప్రదేశాల్లో ప్రమాదకర పరిస్థితుల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నా అధికారు లు పట్టించుకోవడం లేదు. జనవాస ప్రాంతాల్లో, వాహన దారులకు, విద్యార్థులకు, కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్ల వల్ల ప్రమాదాలు తలెత్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.